
# తొలివెలుగు

కథ



– వావిలికొలను రాజ్యలక్ష్మి

**చే**టలో బియ్యం పోసుకొని వంటింట్లోనుంచి పెరట్లోకి వున్న గుమ్మంమెట్టుపై కూర్చుంది అనసూయ. బియ్యాన్ని అటు ఇటు కెలుకుతూ... మట్టిబెడ్డల్ని ఏరివేస్తూ పెరట్లో వున్న బాదంచెట్టుపై గలాటగా అరుస్తున్న కాకుల్ని అప్పుడప్పుడు పరికిస్తోంది.

ఇంతలో బయట కాలింగ్ బెల్ మోగింది.

లేచి చేట వంటింట్లో పెట్టి గబగబా హాల్లోకెళ్లి తలుపులు తెరిచింది. గుమ్మంలో ఎదురుగా చేతిలో సూట్‌కేస్ పట్టుకొని నిల్చుని వుంది సుజల. హఠాత్తుగా కూతుర్ని అలా చూడగానే అనసూయ భ్రుకుటి ముడిపడింది. పైకి చిన్నగా నవ్వుతూ "చెప్పాపెట్టకుండా వచ్చావేం సుజీ?....." పలుకరిస్తూ కూతురి చేతిలో నుంచి సూట్‌కేస్ అందుకోబోయింది.

"ఏం, రాకూడదా?...." దూకుడుగా అంటూ సూట్‌కేస్ తల్లికి ఇవ్వకుండా విసురుగా లోపలికి వచ్చిన సుజల హాండ్‌బ్యాగ్‌ను సోఫాలో పడేసి బాత్‌రూమ్‌వైపు వెళ్ళింది. వంటింట్లో కెళ్ళి కాఫీ కలుపుతూ కూతురి హఠాత్ ఆగమనానికి విస్తుబోతున్నట్లుగా ఓక్షణం ఆలోచనలో పడింది అనసూయ.

టవల్‌తో ముఖం తుడుచుకుంటూ వంటింట్లోకి వచ్చిన కూతురికి కాఫీ కప్పు అందిస్తూ.. "అల్లుడు గారు...మీ అత్తగారు వాళ్ళు అంతా బాగున్నారా?" అంది.

"ఆఁ..." ముక్తసరిగా జవాబు.

"పద హాల్లో కూర్చుందాము" అంటున్న తల్లిని అనుకరిస్తూ "ఎవరూ లేరేం ఇంట్లో..." విస్మయంగా అడిగింది సుజల.

"ఎవరుంటారు ఈ వేళలలో ఇంట్లో... మీ తమ్ముడు మరదలు ఆఫీసుకు వెళ్ళారు. సాయంత్రాని కల్లా వచ్చేస్తారు".

"ఓహోఁ... ఇప్పుడు ఆవిడగారు కూడా జాబ్ చేస్తోందా!" కళ్ళెగరేసింది అదోలా.

"ఆఁ... చేస్తోంది రమ్య వుద్యోగం. అంత చదువు చదువుకొని ఇంట్లో కూర్చోవడం ఎందుకని నేనే వుద్యోగం చేయమని చెప్పాను. ఒక నెల అవుతుంది చేరి. అందున ఈ రోజుల్లో మొగుడు పెళ్ళాం కష్టపడితేనే నాల్గు డబ్బులు వెనకేసుకోగలరు. మనకేం పెద్దల ఆస్తిపాస్తులు లేవుకదా! రేపు పిల్లాజెల్లా పుట్టుకొస్తే అక్కరకొస్తుంది".

"తనకేం.... దర్జాగా రాణిలా వుద్యోగం వెలగబెడుతోందన్నమాట. ఇంట్లో వంటకి, పనికి ఎంచక్కా నీవు వున్నావుగా!.........

కూతురి వెటకారపు ధోరణి అనసూయకు నచ్చలేదు.

"రమ్య చాలా మంచిదమ్మాయ్ ! నన్ను ఒక్క పనీ చేయనీయదు తెలుసా? తాను వెళ్ళేవరకు అన్నీ తానే చేస్తుంది. నేను చేస్తానని చెప్పిన వినదాయె! మధ్యాహ్నం కాస్త వేడిగా అన్నం వండుకుంటానంతే. మళ్ళీ సాయంత్రం వచ్చాక రాత్రి వంటపని అంతా తానే చూసుకుంటుంది. చాలా అణుకువ గల పనివంతురాలు". కోడలి మెచ్చుకోలు అసలు రుచించలేదు సుజలకు. కాఫీ కప్పు క్రిందపెడ్తూ చిన్నగా నిట్టూరుస్తూ తల్లి వంక ఓ మారు తీక్షణంగా అదోలా చూసింది.

"నేను అన్నం వండేస్తాను సుజీ! నువ్వీలోగా స్నానం చేసేయ్. ఇద్దరం కలిసి భోజనం చేద్దాం" అంటూ అనసూయ ఖాళీ కప్పు తీసుకొని వంటింట్లో కెళ్ళింది.

*******

చందు, రమ్య స్కూటర్ దిగి గలగల నవ్వుతూ ఇద్దరూ ఒకేసారి జంటగా ఇంట్లోకి వచ్చారు. ఎదురుగా సోఫాలో కూర్చున్న సుజలను చూసి... ఆశ్చర్యం, ఆనందం ముప్పిరిగొన్న గొంతుకతో "హాయ్, అక్కయ్యా ! ఎప్పుడొచ్చావ్?...." హుషారుగా, ప్రేమగా పలుకరించాడు చందు.

"ఎలా వున్నారు వదినా మీరు...." నవ్వుతూ నెమ్మదిగా పలుకరింపుగా మాటలు కలిపింది రమ్య.

తమ్ముడి మరదలి పలుకరింపులోని ఆప్యాయతను అర్థం చేసుకోలేని సుజల "ఎలా వున్నానో కనబడడం లేదా?!..." వెటకారంగా సాగదీసింది.

చందుకైతే అక్క మాటలు అంతగా కొత్తేం కావు కాని, రమ్యమాత్రం చాలా హర్ట్ అయింది. ఎందుకంటే పెళ్ళిలో మూడు నెలల క్రితం తాను సుజలను చూసింది. పెళ్ళి హడావిడిలో ఆమెతో అంతగా మాట్లాడినట్లుగా గుర్తులేదు. మళ్ళీ ఇప్పుడే ఆమెను చూడ్డం. చందు కూడా వాళ్ళక్కని గురించి ఎప్పుడూ ఏమీ చెప్పలేదు. అందుకని ఆవిడను ఎలా అర్థం చేసుకోవాలో రమ్యకి తెలియ లేదు.

"వదిన వచ్చారు కదా.... ఏదైన టిఫిన్ చేయనా అత్తమ్మా?"

"అత్తమ్మ ఏమిటి? చెత్తమ్మలాగా!... చక్కగా అత్తగారు అని పిలువలేవా మా అమ్మని?" ఓరగా చూస్తూ మరో చురక అంటించింది మరదలికి,

ఈ మారు రమ్య వదనం మ్లానమైంది.

చందు తల్లి వంక చూశాడు. అనసూయ కొడుకు ముఖంలోని భావాల్ని అర్థం చేసుకొని చిన్నగా నవ్వుతూ "ఎలా పిలిస్తే ఏముంది సుజీ! అత్త ప్రేమను... అమ్మ ప్రేమను రెండూ కలిసేలాగా రమ్య ఆప్యాయంగా పిలిచే ఆ అత్తమ్మ పిలుపు నాకు చాలా బాగా నచ్చింది. అందుకని నేను తనని అలాగే పిలువమన్నాను." సర్ది చెప్పింది కూతురికి.

"ఏమో నీకైతే బాగుందేమో గాని, వింటున్న నాకైతే చాలా ఎబ్బెట్టుగా వుందా పిలుపు! అయినా నీవైన మీ ఆవిడతో చెప్పలేకపోయావా చందూ.... అమ్మని ఎలా పిలువాలో......" ఈ మారు తమ్ముడి వైపు తిరిగి అంది.

"మనస్సులో ప్రేమానురాగాలు వుండాలే గాని, ఎలా పిలిస్తే ఏముందక్కయ్యా! అవునూ... బావగారు ఎలా వున్నారు?"

"ఆయనకేం నిక్షేపంలా వున్నారు."

"అక్కాతమ్ముడు మాట్లాడుకుంటూ వుంటారుగాని, పద రమ్యా!.... మనం వేడివేడి పకోడీలు చేద్దాం." అంటూ అత్త కోడలు అక్కడి నుండి కదిలారు.

*******

ఆ రాత్రి పడుకోబోయే ముందు రమ్య కొంచెం ముభావంగా వుండడం చందు గమనించాడు. "ఏం, రమ్యా! భోజనాలప్పుడు నీ వంట మీద మా

### హెన్రీ డెరోజియో
### (1809 - 1831)

హెన్రీలూయిస్ వివియన్ డెరోజియోని మొట్టమొదట ఆంగ్ల కవిత్వం రాసే భారతీయుడుగా అభివర్ణిస్తారు, పోర్చుగీసు భారత మిశ్రమ పాలనలో ఉన్న కలకత్తాలో 1809లో పుట్టిన ఈయన మీద ఫ్రెంచి విప్లవం ప్రభావం చాలా ఉండేది. దేశభక్తి, చావుపుట్టుకలు, ప్రేమ, జీవిత పార్శ్వాలు ముఖ్యంగా ఈయన కవిత్వాంశాలు. "ది ఫకీర్ ఆఫ్ జంగీరా" మొదటి ఇండియన్ కవిగా ఈయన స్థానాన్ని సుస్థిరం చేసిన సంపుటి.

అక్కయ్య చేసిన కామెంట్స్‌కు బాధ పడుతున్నావా?"

"అబ్బే, అదేం లేదులెండి. నాకు నిజంగానే వంట రాదాయె! అత్తమ్మ దగ్గర నేర్చు కొని.... ఈ రెండు నెలలనుంచే కదా నేను వంట చేస్తున్నది. వదిన అలా అన్నారని నేనేం బాధపడ్డం లేదు."

''ఇంతలో సెల్‌ఫోన్ మోగింది. తలగడ ప్రక్కనే వున్న సెల్ అందుకొని నెంబర్ చూస్తూ ఆన్ చేసి "హల్లో!...." అన్నాడు చందు.

"హల్లో.... చందూ! నేను ప్రకాష్‌రావుని...."

"హాయ్.....బావగారూ! ఎలా వున్నారు?"

"సుజల అక్కడికి వచ్చిందా?"

"ఆc.... వచ్చింది బావా!....."

"హమ్మయ్య! అక్కడికే వచ్చిందన్నమాట. ఇక్కడ మేమంతా కంగారుతో తెగ బాధపడ్మతున్నాం చందూ! ఎటు వెళ్ళిందేమోననీ....."

"ఏం.... ఇంట్లో చెప్పలేదా?"

"చెప్తే నాకెందుకీ కంగారు?!... ఇంట్లో గొడవ పెట్టుకొని ఎవరితో చెప్పా పెట్టకుండా వెళ్ళి పోయింది. ప్రతిరోజూ ఇంట్లో ఓ నరకం సృష్టి స్తుందనుకో మీ అక్క. చెల్లాయ్ పెళ్ళి బాధ్యత... తమ్ముడి చదువు.... అమ్మని వదిలేసి నన్ను వేరే కాపురం పెట్టమని రోజూ ఒహాటే పోరు!.... లేకపోతే ఇంట్లో వాళ్ళతో ఒట్ఠి పుణ్యానికే జగడాలు!.. నీవేమనుకున్నా సరే చందూ.... మీ అక్కయ్యను భరించడం నాకు చాలా కష్టంగా వుందోయ్... నేను ఫోన్ చేసినట్లు చెప్పకు. అమ్మేమో పుట్టింటికే వెళ్ళి వుంటుంది.. వెళ్ళి నన్ను తీసుకు రమ్మంటుంది. కాని .... వద్దు చందూ! కొన్నాళ్ళు మమ్మల్ని ఇలా ప్రశాంతంగా వుండనీ... అక్కడ మీ దగ్గర ఎన్నాళ్ళు వుంటుందో వుండనీ.... బై... చందూ! గబగబా చెప్పేసి మరోమాటకైన అవకాశం యివ్వ కుండా ప్రకాశరావు ఫోన్ పెట్టేశాడు.

> **తోరూదత్**
> (1856-1877)
> కలకత్తాలో సంప్రదాయబద్ధమైన హిందూ ధనిక కుటుంబములో పుట్టిన ఈమె క్రిస్టియన్ మతాన్ని స్వీకరించిన కుటుంబంతో పాటు మొదట ఫ్రాన్స్‌లోనూ, ఆ తరువాత ఇంగ్లాండులోనూ స్థిరపడింది. తదుపరి తన 18వ ఏట ఇండియా తిరిగివచ్చి ఫ్రెంచి గీతాలను ఆంగ్లంలోకి అనువదించింది. సంస్కృతం నేర్చుకున్న ఈమె ప్రాచ్య-పాశ్చాత్య సాహిత్యాలను మిళితం చేసి, కీట్స్‌వలె సత్యాన్ని-సుందరాన్ని ఆవిష్క రించింది. "ది లోటస్", "కేజూరైనాట్రీ" ఈమెకి ప్రఖ్యాతిని తెచ్చిపెట్టిన కవితలు.

చందు ఆలోచనలో పడ్డాడు. విషయం అర్ధమైంది రమ్యకు. "ప్రకాశరావు అన్నయ్యగారే కదూ ఫోన్ చేసింది? భర్త ముఖంలోకి తేరి పారగా చూస్తూ మెల్లిగా అడి గింది.

"అవును. నిజానికి మా బావ దేవుడు రమ్యా! అతనికిది భార్యగా తగదు.." అక్కపట్ల కోపంతో అంటూ బాధగా నిట్టూ ర్చాడు.

భార్యభర్తలిద్దరూ సుజల కాపురాన్ని గురించే ఆలోచిస్తూ ఏ అర్ధరాత్రికో నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నారు.

★★★★★★★

ఉదయం పెరట్లో పూజకోసం గుత్తులు గుత్తులుగా విరగబూసిన మల్లెపూలని కోస్తున్న తల్లి దగ్గరికి స్నానానికి వెళుతున్న చందు టవల్ మెడ చుట్టూ వేసుకొని వచ్చి మందస్వరాన అన్నాడు "రాత్రి బావగారు ఫోన్ చేశారమ్మా. అక్కయ్య ఇంట్లో దెబ్బలాడి ఎవరికి చెప్పకుండా వచ్చేసిందట. నీతో ఏమైనా చెప్పిందా?"

"ఉహుc... నాకైతే ఏం చెప్పలేదురా! నేనైతే ముందే ఊహించాను, ఇలాంటిది ఏదో జరిగే వుంటుందనీ...." బాధగా నిట్టూర్చింది ఆవిడ.

"విషయమేమిటో కనుక్కో అమ్మా !...." చందు కూడా రెండు మూడు పూలు కోసి తల్లి పట్టుకున్న పూల సజ్జలో వేశాడు.

"మనం తనని ఏమీ అడగవద్దు.... తనంతట తానే విషయమేమిటో చెప్పనీ...." మెల్లిగా అంటూ కూతురు పెరట్లోకి రావడం ఓరకంట గమనించిన అనసూయ "పువ్వులు నేను కోసుకుంటాను గాని, నీవు స్నానానికి వెళ్ళిరా చందూ ఆఫీసుకు టైం అవుతోంది..." అంటూ మాట మార్చింది.

"నీకు పూలు కోయడంలో సాయం చేద్దామంటే

చేయనివ్వవేంటమ్మా....” అని నవ్వుతూ చందు బాత్‌రూమ్ వైపు వెళ్ళాడు.

××××××××××××××

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన రమ్య హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి ఓకవర్ తీసి అత్తమ్మ చేతిలో పెట్టి పాదాభివందనం చేసింది.

“అయ్యో, ఏంటి?... ఈ కవరేమిటి రమ్యా?...” అనసూయ ఆశ్చర్యంగా అడిగింది.

“ నీ కోడలికి మొట్టమొదటి జీతం వచ్చిందే అమ్మా! ఇదిగో... ఈ స్వీట్స్, హాట్‌ప్యాకెట్స్....” అని నవ్వుతూ చందు తన చేతిలోని కవర్స్ టేబుల్‌పై పెట్టాడు.

“ఓహోఁ.... అలాగా” సంతోషంతో కోడలిని నిండు మనస్సుతో ఆశీర్వదిస్తూ “అయినా నాకెందు కమ్మా ఈ డబ్బు? చందుకే ఇవ్వు. వాడైతేనే అన్ని ఖర్చులు సరిగ్గా చూసుకుంటాడు ప్రతినెలా.....” అనసూయ తిరిగి కవర్ ఇవ్వబోయింది.

“ఉహుఁ.... ఆయనకేం వద్దు అత్తమ్మా! మీ దగ్గరనే వుండనీ. ఈ డబ్బుతో వదినకేమన్నా కొని పెడదాం.”

కోడలి మాటకి నిండుగా నవ్వించావిడ.

అక్కడే మల్లెమొగ్గలు కడ్తూ కూర్చున్న సుజల వాళ్ళమాటల్లో... సంతోషంలో పాలు పంచు కోవడంలేదు. మౌనంగా దారం మెలివేసి పూలు కడ్తున్న ఆమె మనస్సు మాత్రం ఎక్కడో వుంది.“ఈ ఆనందం.. ఇలాంటి వుత్సా హం తమ ఇంట్లో ఎందుకు వుండవు?.... తామెప్పుడూ ఇలా వుల్లాసంగా లేమే?..... కారణమేమిటి?... పదే పదే తనను తాను ప్రశ్నించుకుంది.

“వదినా! మిమ్మల్నే....” గట్టిగా పిల్చింది రమ్య.

“ఆఁ..ఏంటీ!అంతలా గట్టి గా పిలువాలా..నాకేం చెవుడు లేదు. ఇక్కడే వున్నానుగా...” కాస్త కంఠం హెచ్చించింది సుజల.

“మీరేవో ఆలోచనలో వుంటేనూ..... కాస్త గట్టిగా పిలిచానంతే! గుడికి వెళదాం వస్తారా వదినా?”

“అమ్మమ్మల్లా ఇప్పటినుంచే గుళ్ళు గోపురాలు తిరగాలా. నాకిష్టం లేదు. మీరు వెళ్ళండి.” కుండ బ్రద్దలు కొట్టినట్లుగా చెప్తున్న కూతురు మాటల్లోని కరుకుతనానికి అనసూయ, చందు విస్తుబోయారు.

“ఎందుకే సుజీ, అలా మాట్లాడుతావు? ముసలి వాళ్ళే వెళతారా గుళ్ళకు....” కూతుర్ని మందలించి నొచ్చుకున్నట్లుగా బాధపడుతున్న కోడలి వైపు తిరిగి “దాని మాటలకేం గాని రమ్యా, నీవు చందు వెళ్ళి రండి గుడికి” అనసూయ అనునయంగా సర్ది చెప్పింది.

“అబ్బో! కోడలి మీద ఈగ వాలనివ్వవే! ఎంత ప్రేమో !...” దెప్పుతున్నట్లుగా దురుసుగా వెట కారంగా సాగదీస్తూ తల్లితో అంటూ, కడ్తున్న పూలు ప్రక్కన పడేసి విసురుగా లేచి గదిలోకెళ్ళింది సుజల.

ఒక్కక్షణం అచేతనంగా నిల్చుండిపోయారు భార్యాభర్తలు. తల్లి ప్రోద్భలంతో తయారయి... రమ్యని తీసుకొని తప్పని సరిగా గుడికెళ్ళాడు చందు.

కొడుకు కోడలు స్కూటర్ పై వెళ్ళిపోయాక అనసూయ వీధి తలుపు దగ్గరగా వేసి తీరుబాటుగా కూతురున్న గదిలోకి వెళుతూ “సుజీ....సుజీ!....” అంటూ పిల్చింది.

★★★★★★★

సుజల దిండులో ముఖం దాచుకుని మంచంపై బోర్లా పండుకొని వుంది.

“సుజీ ! ఏమైందమ్మా?....” కంగారుగా అంటూ మంచంపై కూర్చొని కూతురి తలపైకెత్తి బలవంతంగా తనవైపు తిప్పు కొంది.

ఎర్రనైన కళ్ళనిండా నీళ్ళు. ఏడుస్తున్న కూతుర్ని ప్రేమగా అక్కున చేర్చుకొని “ఏమైంది సుజీ!

**మన్మోహన్ ఘోష్**
**(1869 - 1924)**

1926లో ఘోష్ మరణాంతరం వచ్చిన అతని కవితా సంపుటి “సాంగ్స్ ఆఫ్ లైఫ్ అండ్ డెత్”ని, ప్రసిద్ధకవి ఈట్స్ “వన్ ఆఫ్ ది మోస్ట్ లౌలీ వర్క్” గా అభివర్ణించారు. శ్రీ అరవిందఘోష్ సోదరుడైన ఈయన జీవితం ఒంటరితనంతోనూ, అనారోగ్యంతోనూ భార్యావియోగంతోను గడిచింది. 19వ శతాబ్దపు ఆంగ్ల కవితా రూపురేఖల్ని ఈయన కవిత్వంలో చూడవచ్చు.

**రవీంద్రనాథ్ ఠాగూర్**
**(1861 - 1941)**

ఈట్స్,ఎజ్రాఫౌండ్ వంటి ప్రముఖ కవుల ప్రశంసనూ, యూరోపియన్ విమర్శకుల అభినందనలనూ అందుకొని 1913లో తన పుస్తకం "గీతాంజలి"కి నోబుల్ బహుమతి సాధించిన ఠాగూర్ బెంగాల్ జాతీయకవిగా, భారతీయ ఆత్మను పొదిగిన ప్రముఖుడిగా భారతీయ ఆంగ్ల సాహిత్యంలో చిరస్మరణీయుడుగా కీర్తించబడతాడు. చరిత్రలో ఠాగూర్ నిశ్శబ్దపు అడుగులు ఎప్పటికీ చెరగనివి.

ఇందాక నేను ఏమైన తప్పుగా మాట్లాడి నీకు బాధ కల్గించానా ...." లాలనగా బుజ్జగిస్తున్నట్లుగా అడిగింది.

ఒక్కసారిగా తల్లిని వాటేసుకొని బోరున విలపించింది సుజల. "లేదమ్మా తప్పంతా నాదే! పరాయిఇంటి నుంచి వచ్చిన రమ్య నీకు అంత చేరువగా ఎలా అయిందోనని నా బాధ! ఇదెలా సాధ్యం?... మా అత్తగారింట్లో నేనిలా ఎందుకు వుండలేక పోతున్నాను.... చెప్పమ్మా? మీ అనురాగ అన్యోన్యతను చూసి నేను ఓర్చుకోలేకపోతున్న. నా నోట్లో నుంచి ఏవేవో కరుకైన వాడి మాటలు వస్తున్నాయి. మా ఇంట్లో నరకం. మీ ముగ్గురు ఎంతో ఆనందంగా ఉత్సాహంగా వుంటారే! మరి, మేమెందుకు ఇలా వుండలేకపోతున్నాం. కారణం ఏమిటి? తప్పెవరిది? చెప్పమ్మా నాకు...." అంటూ తన అత్తగారింట్లోని బాధలు కష్టాలు అన్నీ తల్లితో చెప్పుకొని బావురుమంది.

అంతా విన్నాక అనసూయ తన పైట చెంగుతో కూతురి కళ్ళు, ముఖం తుడిచింది. "పిచ్చి సుజీ! ఒక ఇంట్లో వుండే మనుష్యుల మధ్య ఒకరిపట్ల ఒకరికి మామూలుగా వుండవల్సిన ప్రేమాను రాగాలు, ఆపేక్ష.... అభిమానం ఇవన్నీ లోపించినప్పుడే ఆ ఇల్లు నరకం అవుతుంది. కాని... అక్కడ తప్పెవరిదో తెలుసా? నీదే..."

"నాదా?!..." సుజల విస్తుబోయింది.

"అవును ముమ్మాటికి నీదే. పెళ్ళాయ్యాక నీలో ఓ రకమైన అసూయద్వేషాలు అంకురించాయి. ఈర్ష్యా..... అసూయలు మానవసహజం సుజీ! మనం మనల్ని హుందాగా నియంత్రించుకోవాలి. గాలి వార్తల్ని నమ్మి ఆవేశపడిపోకుండా విజ్ఞతతో వ్యవహరించడానికి తెలివితేటలుండాలంతే గాని... మీ అత్తగారు నా గురించి ఎదురింటి వెంకాయమ్మతోను, ప్రక్కింటి పద్మావతమ్మతోను ఏవేవో చెప్తారని నీవంటున్నావు కాని, నీవు మాత్రం ఆవిడకేం తక్కువ తిన్నావ్? అత్తగారని కొంచమైన గౌరవం ఇవ్వకుండా నీ ఫ్రెండ్స్‌తో...... ప్రక్కింటి వాళ్ళతో ఆవిడని గురించి వ్యతిరేకధోరణిలో ఏవేవో అవాకులు చెవాకులు వాగుతుండగా పోయినసారి మీ ఇంటికి వచ్చినప్పుడు నేనే నా చెవులారా విన్నాను. నీకు గుర్తుందా? అప్పుడే నిన్ను మందలించాను... నీవు మాత్రం నా మాటల్ని తేలిగ్గా తీసిపారేశావ్....అవునా?

'అవునన్నట్లుగా' సుజల మెల్లిగా తలూపింది.

కూతురి ముఖంలోని భావాల్ని పసిగట్టిన అనసూయ ఇనుము వేడిగా వున్నప్పుడే ఇంకో రెండు దెబ్బలు వేసి దాన్ని మనకు అనుకూలంగా కావాల్సిన రూపంలో మార్చుకోవాలన్న సూక్తి తెలిసిన ఆవిడ మరలా ఇలా అంది: " మీ అత్తగారు, ఆడపడుచు ఎవరూ చెడ్డవాళ్ళు కారు. నీ నుంచి వాళ్ళకి ప్రేమానురాగాల్ని అందించి చూడు.....అటునుంచి కూడా రెండింతల ప్రేమాభిమానాల్ని వాళ్ళనుంచి పొందగలవు. నీ చుట్టూ వుండేవాళ్ళకి నీ బాధలు కష్టాలు కాదు పంచేది.... ఆత్మీయతానురాగాల్ని పంచు. అప్పుడు చూడు ఇల్లు నందనవనంలా వుంటుంది. రమ్యని నీవు అన్ని విషయాలలో తప్పుగా అర్థం చేసుకొని ఏవగించుకుంటున్నావు గాని తను చాలా మంచి స్వభావం గల అమ్మాయ్. నన్నో దేవతగా పూజిస్తుంది పిచ్చిపిల్ల! ఇక చందు సంగతి నీకు తెలుసుగా సుజీ! నాకు దేనిలో లోటు రానివ్వడు. ఓ మంచి కొడుకుగా తన బాధ్యతను కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాడు. మీ నాన్నగారు లేరన్న ఆ ఒక్కకొరతే గాని... నాకేం తక్కువ?!..... ఆనందంగా వున్నాను. అపోహలకు, అపార్థాలకు, మనస్పర్ధలకు అసలు ఆస్కారమే లేదిక్కడ. అందుకే

నేనిలా సంతోషంగా నిశ్చింతగా వున్నాను.

"అవునమ్మా! రమ్య వచ్చాక మీ ఇల్లు చూస్తుంటే నాకు ఎంతో ముచ్చటేస్తుంది." కళ్లు తుడుచుకుంటూ మారిన మనసుతో అంది సుజల. "పాపం నా మాటలకు రమ్య ఎంత హర్ట్ అయిందో. సారీ చెప్తానమ్మా".

"ఫర్వాలేదు. నీవు సారీ చెప్పినా చెప్పకున్నా రమ్య ఏం బాధపడదు."

"నీవు నిజంగా చాలా అదృష్టవంతురాలివమ్మా. దేవతలాంటి కోడలు దొరికింది నీకు.... నీ నిండు మనస్సుకు తగినట్లుగా" మనస్ఫూర్తిగా అంటూ కళ్ళు తుడుచుకొని గబగబా సూట్‌కేస్ సర్దుకోసాగింది సుజల.

"అదేమిటి? సర్దుతున్నావ్" విస్మయంగా అడిగింది తల్లి. "నేను ఇప్పుడు వూరెళ్ళిపోతాను అమ్మా! నేనిక్కడికి వచ్చినట్లుగా మా వాళ్ళకి కనీసం ఫోన్ కూడా చేయలేదు నేను..."

"నీవు చేయకున్నా అల్లుడుగారే ఫోన్ చేశారు నీవు వచ్చిన రోజు రాత్రే..."

"మరి నాతో చెప్పలేదే!..." సుజల కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి.

"కావాలని మేమే చెప్పలేదు. పోనీ రేపు ఉదయం వెళ్ళు సుజీ!...

"లేదమ్మా. నన్ను ఆపకు. ఈ రోజే ఇప్పుడే వెళ్తాను." కూతురి కంఠంలో నుంచి చాలా దృఢంగా వచ్చాయామాటలు.

అంతలో గుడికెళ్ళిన చందు,రమ్య తిరిగి వచ్చారు. ఇంటిలోని సన్నివేశానికి విస్తుబోయారు.

వెళ్ళడానికి రెడీగా వున్న సుజల మరదలి దగ్గరగా వెళ్ళి "నిన్ను నా పదునైన మాటలతో చాలా బాధపెట్టాను కదా రమ్యా! సారీ... నీవు,చందు కలిసి దసరా పండగకి మావూరు రండి." మనసారా అన్నది.

"ఈ హటాత్తు ప్రయాణం ఏమిటే అక్కయ్యా...." సుజల నొదుటిన బొట్టు పెడ్తూ "ఇవాల్టికి వుండి పొండి వదినా!...." రమ్య ఎంత చెప్పినా వినలేదు.

"ఈసారికి వెళ్ళనీ రమ్యా...." అనసూయ కూడా కోడలికి సర్ది చెప్పింది.

అక్కతో పాటు బస్సుస్టాండ్‌కు వెళ్ళడానికి బయట వాకిట్లోకెళ్ళి అటుగా వెళ్తున్న ఖాళీ ఆటోని పిలిచి... అక్క చేతిలోని సూట్‌కేస్ అందుకొని చందు అందులో పెట్టాడు.

తమ్ముడి ప్రక్కన ఆటోలో కూర్చున్న సుజల తల్లికి మరదలికి చెయ్యి వూపింది. ఆటో సర్రున ముందుకు దూసుకుపోయింది.

"ఇన్నాళ్ళకి దాని కళ్ళల్లో తొలిసారిగా వెలుగు చూశానమ్మా." నిండు మనస్సుతో కూతురిని గురించి సంతోషంగా అంటూ ఆప్యాయంగా కోడలి భుజంపై చెయ్యి వేసి ప్రేమగా అదిమి దగ్గరికి తీసుకుంది అనసూయ.★

# కోటి రూపాయల నోటు

లిప్‌స్టిక్ రాసుకున్న పెదాలు
ప్లాస్టిక్ పువ్వుల్లా మెరుస్తున్నాయి
నడుస్తుంటే స్పాంజ్ వక్షోజాలు
నీటిబుడగల్లా ఎగిరెగిరిపడుతున్నాయి
బొడ్డుకిందకి కట్టిన చీరె
వెయ్యిరూపాయలనోట్లతో నేసినట్టుంది
ఆమె -
బాక్సాఫీసు హిట్టుకొట్టిన నటీమణి!

గాలికి ఎగురుతున్న నైలాన్ జుట్టు
నారియల్‌తేల్ వాసనతో గుభాళిస్తోంది
నుదుటి నుంచి కనుబొమ్మల మధ్యకి
జారిన బొట్టు పాముకన్నులా చూస్తోంది
ఆమె స్త్రీ కాదా?
సినీప్రపంచం ముద్రించిన
కోటిరూపాయల నోటు!

-డా॥ మానేపల్లి.